
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 21 ఏప్రిల్ 2024



**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.150 | 218 | 248 |
| సూర్యాపేట | రూ.125 | 220 | 250 |
| నల్లగొండ | రూ.140 | 204 | 230 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 24.8

# నేడు భువనగిరికి సీఎం రేవంత్

- రోడ్‌షోలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- లక్ష మందితో భారీ ర్యాలీ
- యాదాద్రి జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి
- సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ



సీఎం రేవంత్ రోడ్‌షో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీ రాజేష్‌చంద్ర

**యాదాద్రి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రకటించినప్పటి నుంచి ఆయా నియోజకవర్గాల్లో పార్టీ సన్నాహక సమావేశాలు, నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాల్లో పార్టీ నేతలు బిజీబిజీగా ఉన్నారు. నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో భారీ ర్యాలీలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పార్టీ అభ్యర్థులను గెలుపించుకునేందుకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ, రోడ్‌షోలు, భారీ బహిరంగసభల్లో పాల్గొంటున్నారు. ఈ మేరకు ఆదివారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం భువనగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు భువనగిరి పట్టణంలో పెద్దఎత్తున రోడ్‌షో నిర్వహించేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారిగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి రానుండటంతో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు లక్షమందితో ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో భువనగిరికి సీఎం రేవంత్‌రెడ్డి చేరుకోగానే హైదరాబాద్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రోడ్‌షో నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి భువనగిరిలోని అంబేడ్కర్ చౌరస్తాను పరిశీలించారు. ఈ సందర్భంగా భువనగిరి జోన్ డీసీపీ రాజేష్‌చంద్ర సీఎం పర్యటనతోపాటు ర్యాలీకి సంబంధించిన అంశాలను కమిషనర్‌కు వివరించారు. ఎన్నికల సభలు, సమావేశాలపై పోలీసు కమిషనర్ అధికారులతో సమీక్షించారు.

# పాలేరు వాగులో ఇసుక మాఫియా

- రెండు మండలాల కీలక నాయకుల కనుసన్నల్లో అక్రమ రవాణా
- పోలీసుల సహకారంతోనే మాఫియా రెచ్చిపోతోందనే ఆరోపణలు
- 150 ట్రాక్టర్లను సమీకరించి దందా
- రాత్రివేళ జోరుగా రవాణా

భూగర్భజలాలు అడుగంటిన సందర్భంలో జలవనరులను సంరక్షించుకోవాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వాగులను ఇసుక మాఫియా చెరబడుతోంది. అడ్డగోలుగా తవ్వకాలు చేస్తూ వాగులను ధ్వంసం చేస్తోంది. పోలీసు యంత్రాంగం, ఛోటా లీడర్ల కనుసన్నల్లో వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు రాజకీయనేతల ఒత్తిళ్లకు లొంగి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



నల్లగొండ జిల్లా రావులపెంట సమీపంలో పాలేరు వాగులో ఇసుక తవ్వకాలు, ఇసుక రవాణాకు వచ్చిన ట్రాక్టర్లు

మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రవహించే పాలేరు వాగును చెరబట్టిన ఇసుకమాఫియా వేములపల్లి మండలం రావులపెంట పరిసర ప్రాంతాల నుంచి నిత్యం 150 పైచిలుకు ట్రాక్టర్లతో ఇసుకను మిర్యాలగూడ, పరిసర గ్రామాలకు అక్రమంగా తరలిస్తోంది. ఎలాంటి అనుమతులు లేకుండా సాగే ఈ దందాని అడ్డుకోవాల్సిన అధికారయంత్రాంగం వారికి సహకరిస్తోందని వాగు పరిసర ప్రాంతాల రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కీలక నాయకులు, పోలీసుల కనుసన్నల్లో పాలేరు వాగును ఇసుక మాఫియా లూటీ చేస్తోందని ఆరోపిస్తున్నారు. వేములపల్లి మండలంలో ప్రవహించే పాలేరు వాగు నుంచి రావులపెంట సమీపంలో అక్రమంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా మిర్యాలగూడ పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు రవాణా చేస్తున్నారు. మైనింగ్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా యథేచ్ఛగా ఇసుక రవాణా సాగుతోంది. మిర్యాలగూడ రూరల్, వేములపల్లి మండలాలకు చెందిన 150కి పైగా ట్రాక్టర్లను సమీకరించి ఇసుక రవాణా చేస్తున్న వారికి కొందరు నాయకులు పూర్తిగా సహకరిస్తున్నట్లు వినికిడి.

### రోజుకో కోడ్

ప్రతి రోజూ రాత్రివేళల్లో ఇసుక దందా కొనసాగుతోంది. సిండికేట్‌లో ఉన్న ట్రాక్టర్లను మార్గమధ్యలో పోలీసులు పట్టుకోకుండా రోజుకో కోడ్‌ను వినియోగిస్తున్నారు. విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఎక్కడైనా వాహనాలు ఆపితే, ఈ కోడ్‌ను వారికి చెబితే ట్రాక్టర్లను వదిలేస్తున్నారు. ఎలాంటి ఆటంకాల్లేకుండా ట్రాక్టర్లలో ఇసుక రవాణాకు అనుమతిస్తున్నందున ఒక్కో ట్రాక్టర్ యజమాని నెలకు రూ.12వేల వరకు చెల్లిస్తున్నారని, అందులో పోలీసులకు, ఇతర శాఖల అధికారులకు వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కీలకమైన ఇద్దరు నాయకులు పోలీస్‌శాఖలో ఈ దందాను నియంత్రించాల్సిన అధికారితో పాటు, మరో క్షేత్రస్థాయి అధికారి, సుదీర్ఘకాలం పోలీస్ కార్యాలయంలో తిష్ఠవేసిన మరో ఉద్యోగితో కలిసి దీన్ని నిర్వహిస్తున్నారని తెలిసింది. ఒక్క రావులపెంట ప్రాంతం నుంచే నిత్యం 1,000 క్యూబిక్‌మీటర్ల వరకు ఇసుక అక్రమంగా తరలిపోతుంది. ఇటు మైనింగ్‌శాఖకు గానీ, అటు రెవెన్యూశాఖకు గానీ, గ్రామపంచాయతీకి గానీ ఎలాంటి ఆదాయం రాకపోగా, అడ్డగోలు తవ్వకాలతో వాగులో నీటిచెమ్మలేకుండా పోతోంది. దీంతో పరిసరాల్లోని బోరుబావులు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. సూర్యాపేట- బీమారం- మిర్యాలగూడ రహదారిలో నిత్యం రాత్రివేళ భారీగా ఇసుకట్రాక్టర్లు ఎలాంటి అనుమతుల్లేకుండా వెళ్తున్నా పోలీసులుగానీ, ఇతర శాఖల అధికారులు గానీ పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ఈ అక్రమదందాకు సహకరిస్తున్న పోలీసులను కట్టడి చేసేందుకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, సంబంధిత అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, మైనింగ్, రెవెన్యూశాఖలు ఈ దందాను నిరోధించేందుకు కార్యాచరణ అమలు చేయాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. రావులపెంట కేంద్రంగా సాగుతున్న ఇసుకతవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని జిల్లా మైనింగ్‌శాఖ అధికారి జే.శామ్యూల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



# జలాన్ని ఒడిసి పడదాం

- ఇంకుడు గుంతలతో భూగర్భజలాలు భద్రం
- అవగాహన లోపంతో ఇంకుడు గుంతలపై కొరవడిన ఆసక్తి



భూగర్భజలాల నీటి మట్టాన్ని కాపాడడంలో ఇంకుడు గుంతలు కీలక పాత్ర వహిస్తాయి. వర్షపు నీరు, ఇళ్లలో ఉత్పత్తయ్యే మురుగు నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించగలిగితే భూగర్భజలాలను కాపాడినట్టే. ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇళ్లు, జనావాసాల మధ్యలోని లోతట్టు ప్రాంతంలో సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రభుత్వం గతంలోనే సంకల్పించింది. గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు నిర్మించారు. అలాగే ఇళ్లలో నిర్మించుకునే ఇంకుడు గుంతలకు ప్రభుత్వం నిర్దేశిత మొత్తాన్ని అందజేస్తున్నది.

- భువనగిరి టౌన్

పట్టణ ప్రాంతాల్లో 300 గజాలకు పైబడి విస్తీర్ణంలో నిర్మించే భవనాల్లో ఇంకుడు గుంత నిర్మిస్తేనే నిర్మాణ అనుమతులు అనే నిబంధన కూడా ఉంది. అయినా ఇంకుడు గుంతల నిర్మాణం పట్ల ప్రజలతో పాటు ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చూపుతున్నట్లు లెక్కలు పేర్కొంటున్నాయి. నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుండడంతో వేసవిలో ఇంకుడుగుంతల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు యాదాద్రి జిల్లాలో 24,873 మ్యాజిక్ ఇంకుడు గుంతలు, 645 సామూహిక ఇంకుడు గుంతలు మాత్రమే నిర్మించారు.

### ఇప్పటి వరకు

జిల్లాల పునర్విభజన అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 25,528 ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటివరకు 24,873 పూర్తి కాగా, మరో 655 పనులు కొనసాగుతున్నాయి. అలాగే 1193 సామూహిక ఇంకుడు గుంతలను నిర్మించాలని లక్ష్యం విధించినా 645పూర్తి కాగా 43పనులు కొనసాగుతున్నాయి. మిగితా 688 ఇంకుడు గుంతల నిర్మాణాలకు స్థలాలను గురించాలేదు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోనే ఇంకుడు గుంతల నిర్మాణం కాస్త మెరుగ్గా ఉంది. మునిసిపల్ చట్టం ప్రకారం పట్టణాల్లో 300గజాల పైబడి విస్తీర్ణంలో నిర్మించే భవనంలో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మాంచాల్సి ఉంటుంది. భవన నిర్మాణ అనుమతుల కోసం వసూలు చేసే ఫీజులో ఇంకుడు గుంత నిర్మాణం కోసం రూ.1500 వసూలు చేస్తారు. భవన నిర్మాణం పూర్తయ్యాక టౌన్‌ప్లానింగ్ అధికారులు తనిఖీ చేసి ఇంకుడు గుంత నిర్మాణాన్ని పరిశీలిస్తారు. ఇంకుడు గుంత నిర్మిస్తే వసూలు చేసిన రూ.1500 తిరిగి చెల్లిస్తారు. లేని పక్షంలో అట్టి మొత్తాన్ని జప్తు చేస్తారు. కానీ అవగాహన లోపం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పలువురు ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ఆసక్తి చూపడం లేదు. భువనగిరి పట్టణంలో 300గజాల పైబడి విస్తీర్ణంలో 350కి పైగా భవన నిర్మాణాలు జరగగా, ఇంకుడు గుంతల నిర్మాణం మాత్రం 70దాటలేదని తెలుస్తోంది. ప్రతి ప్రభుత్వ కార్యాల యం, పెట్రోల్ బంక్, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, తదితర సామూహిక భవనాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉంటుంది. కానీ జిల్లాకేంద్రం భువనగిరితో పాటు మిగతా ఐదు మునిసిపాలిటీల్లో కూడా ఇంకుడు గుంతల నిర్మాణం, నిర్వాహణ అంతంత మాత్రమే.



### ఇంకుడు గుంతలతో భూగర్భజలాలు భద్రం

ఇంకుడు గుంతలతో భూగర్భజలాల నీటి మట్టం భద్రంగా ఉం టుందని నీటిరంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటిలో ఉత్పత్తయ్యే మురుగు నీరు, వర్షం నీరు వృథాగా పారకుండా ప్రత్యేక డిజైన్‌లో నిర్మించే ఇంకుడు గుంతలోకి మళ్లించాలని నిపుణులు పేర్కొంటారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో మురుగు నీటి సమ స్య కూడా పరిష్కార మవుతుంది. మురుగు కాల్వల నిర్మాణం అవస రం ఉండకపోగా దుర్గం ధం, దోమలు తదితర కీటకాలు, జంతువుల స్వైర విహారం కూడా తగ్గు తుంది. ఇళ్లలో నిర్మించుకునే ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ.4వేలు అందిస్తుంది. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో సామూహిక అవసరాల కోసం నిర్మించే ఇంకుడు గుంతలకు రూ.11 వేలు మంజూరు చేస్తారు. జిల్లాలో సుమారు 1.25లక్షల గృహాలు ఉండగా ఇప్పటి వరకు కేవలం 26,500 ఇంకుడు గుంతలు మాత్రమే నిర్మించారు. నిపుణుల అంచనా ప్రకారం జిల్లాలో మరో సుమారు 70వేల ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉంది.


### ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నాం



ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యానికి చేరువయ్యాం. అయినప్పటికీ నూతన దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇంకుడు గుంతల నిర్మాణానికి ఆసక్తి చూపే వారందరికీ సహకారం అందిస్తాం. ఇంకుడు గుంతల నిర్మాణం ఆవశ్యకత వివరిస్తున్నాం. అవసరమైన ప్రతీ చోట ఇంకుడు గుంత నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యం.

- శ్యామల, డీఆర్‌డీవో ఏపీడీ

### సర్వే చేస్తున్నాం



భువనగిరి పట్టణంలో ఇంకుడు గుంతల నిర్మాణం పై సర్వే చేస్తున్నాం. భవన నిర్మాణం అనుమతుల ఆధారంగా మునిసిపల్ బృందాలు ఇళ్లిల్లు తిరుగుతూ ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంక్‌లు తదితర సామూహిక ప్రాంతాల్లోని ఇంకుడు గుంతల నిర్మాణం, వాటి నిర్వాహణపై పరిశీలిస్తున్నాం. సర్వే పూర్తయ్యాక అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- రామాంజులరెడ్డి, కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ

# మూడో రోజు 12 నామినేషన్లు దాఖలు



ఎన్నికల అధికారి దాసరి హరిచందనకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పాలకూరి రమాదేవి

**నల్లగొండటౌన్, భువనగిరి అర్బన్, ఏప్రిల్ 19:** లోకసభ ఎన్నికల నామినేషన్లలో భాగంగా మూడో రోజు శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంటు నియోజకవర్గాలకు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గానికి స్వంతంత్ర అభ్యర్థులుగా కుక్కల వెంకన్న ఒక సెట్ నామిషన్ దాఖలు చేయగా, పాలకూరి రవి, పాలకూరి రమాదేవి, మారం వెంకట్‌రెడ్డి ఒక్కో సెట్‌ను దాఖలు చేశారు. అదేవిధంగా పనస వెంకటేశ్వర్లు, గంగిడిరెడ్డి కోటిరెడ్డి, తండు ఉపేందర్‌గౌడ్ రెండేసి సెట్ల చొప్పున నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు అందజేశారు. నల్లగొండ స్థానానికి ఏడుగురు అభ్యర్థులు 10సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. భువనగిరి నియోజకవర్గ స్థానానికి శనివారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. బహుజన రిపబ్లిక్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి కదిరే కిరణ్‌కుమార్, బహుజన ముక్త్‌పార్టీ అభ్యర్థిగా పెంట రమేష్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా కొంగరి లింగస్వామి, స్వతంత్ర అభ్యర్థులుగా ధీరావత్ గోపినాయక్ ఒక్కోసెట్ చొప్పున,ఊదరి మల్లేశం రెండు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, భువనగిరి కలెక్టర్ హనుమంత్ కే.జెండగేకి నామినేషన్లు అందజేశారు. మొత్తం ఐదుగురు అభ్యర్థులు ఆరుసెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. కాగా, మొదటిరోజు ఏడు, రెండో రోజు తొమ్మిది, మూడో రోజు 12 నామినేషన్లతో కలిపి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు 28 నామినేషన్లు దాఖలయ్యాయి.

**నామినేషన్ కౌంటర్** 3వ రోజు

| నియోజకవర్గం | 20న దాఖలు | గతంలో దాఖలు | మొత్తం |
|---|---|---|---|
| నల్లగొండ | 7 | 8 | 15 |
| భువనగిరి | 5 | 8 | 13 |
| మొత్తం | 12 | 16 | 28 |

### ఎన్నికల సామగ్రి తరలింపు

**భువనగిరి అర్బన్, చండూరు:** ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని అధికారులు తరలిస్తున్నారు. భువనగిరిలోని కలెక్టరేట్‌లో ఇప్పటికే పోలింగ్ సామగ్రికి చెందిన సంచులను పోలింగ్ కేంద్రాల వారీగా సిద్ధం చేశారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి కేంద్ర బలగాల భద్రత నడుమ ప్రత్యేక వాహనాల్లో ఈవీఎం, వీవీ ప్యాట్లను చండూరుకు తరలించారు. ఏఆర్వో, ఆర్డీవో సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లను చండూరులోని డాన్‌బోస్కో కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.



## కాంగ్రెస్ రైతు పక్షపాతి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

•7లో..



## రైతులను పట్టించుకునే నాథుడే లేడు

సుఖేందర్‌రెడ్డితో ఎలాంటి విభేదాలు లేవు : జగదీష్‌రెడ్డి

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రేమ్‌కరణ్‌రెడ్డి

**మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 20:** వయోజనులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్, జడ్పీసీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా అతితక్కువ ఓటు శాతం నమోదైన పీఎస్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతీ ఓటరు వినియోగించుకోవాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసిందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఓటు హక్కుపై ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. సీ-విజిల్ యాప్‌లో ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై పూర్తి సమాచారం ఉంటుందని, స్మార్ట్‌ఫోన్ వినియోగించే ప్రతీ ఓటరు ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై సంఘం సభ్యులకు వివరించారు. సమావేశంలో మెప్మా పీడీ కరుణాకర్, డీఎల్‌పీవో రాఘవరావు, డీపీఎం అరుణ్‌కుమార్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

### గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు

**మిర్యాలగూడ రూరల్:** ప్రస్తుత వేసవిలో గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. స్థానిక రైతువేదికలో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్, ఉపాధిహామి, విద్యాశాఖ, ఐకేపీ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటినందున చేతిపంపులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అవసరమైన చోట రైతుల నుంచి బోర్లను అద్దెకు తీసుకొని ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఏకరూప దుస్తులను కుట్టించి పాఠశాల పునః ప్రారంభంలోపు అందించాలన్నారు. కార్యక్రమంలో డీపీవో కె.మురళీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు సహాయ సంచాలకుడు నవీన్‌కుమార్, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఏఈలు, ఎంపీవో పద్మ, ఏపీవో కళావతి, ఏపీఎంలు శేషయ్య, కృష్ణమూర్తి తదితరులున్నారు.

# నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలి

ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ జీఎం రాజు

**నల్లగొండ టౌన్, ఏప్రిల్ 20:** ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి మిల్లర్లకు నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ రాజు అన్నారు. శనివారం ఆయన ఎఫ్‌సీఐ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 2023-24 యాసంగిలో 1.19లక్షల సీఎంఆర్ రైస్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. మిల్లర్లు త్వరగా పూర్తి చేస్తే ఎక్కువ బాయిల్డ్ రైస్ మంజూరు చేస్తామన్నారు. సెలవు రోజుల్లో కూడా హమాలీలు పనిచేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ అధికారులు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎఫ్‌సీఐ గోదాముల్లో ఖాళీస్థలాలు ఏర్పాటు చేయాలని, వింగ్స్ ద్వారా ప్రతీ మిల్లర్‌కు రెండు లాట్‌లు కేటాయిస్తున్నందున ఆసంఖ్యను నాలుగు లాట్‌లకు పెంచాలన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఎఫ్‌సీఐ జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత అదృశ్యంపై అనుమానాలు?

**సూర్యాపేట క్రైం/ జగ్గయ్యపేట, ఏప్రిల్ 20:** సెటిల్‌మెంట్ కోసం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు వెళ్లిన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె ఎల్లయ్య అదృశ్యం మిస్టరీగా మారింది. మూడు రోజుల క్రితం గురువారం కోదాడకు చెందిన స్నేహితుడితో కలిసి జగ్గయ్యపేటకు కారులో వచ్చిన ఆయన కనిపించకుండా పోవటంతో శుక్రవారం ఎల్లయ్య సోదరుడు సూర్యాపేట, జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ అనే మహిళకు శ్రీనివాస్ అనే వ్యక్తికి మధ్య వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదంలో మధ్యవర్తిత్వం కోసం కోదాడకు చెందిన అంజయ్య అనే స్నేహితుడితో కలిసి కారులో ఎల్లయ్య జగ్గయ్యపేటకు వచ్చాడు. శ్రీనివాస్ జగ్గయ్యపేటలో మాట్లాడుకుందామని చెప్పటంతో వారంతా ఇక్కడకు వచ్చినట్టు ఎల్లయ్య సోదరుడు సతీష్ చెబుతున్నారు. వారంతా జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డులో మాట్లాడుకున్నాక, డబ్బులు ఇస్తానని శ్రీనివాస్ ఎల్లయ్యను తీసుకుని వెళ్లడం, ఆ తర్వాత అపర్ణ వాష్‌రూమ్‌కు అని చెప్పి వెళ్లడం, వెళ్లినవారు తిరిగి రాకపోవడం, ముగ్గురి మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ కావటంతో అంజయ్య సూర్యాపేటలోని స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో ఎల్లయ్య సోదరుడు సూర్యాపేటలో, జగ్గయ్యపేటలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జగ్గయ్యపేట సమీపంలో ఒక చోట వీరు సమావేశం అయినట్టు చెప్పిన ప్రాంతాన్ని రెండు జిల్లాల పోలీసులు పరిశీలించారు. జగ్గయ్యపేట, సూర్యాపేటకు చెందిన పోలీసులతో ఆరు బృందాలు దర్యాప్తు చేపట్టాయి.

### పథకం ప్రకారమే చేశారా?..

అదృశ్యమైన కాంగ్రెస్ నేత ఎల్లయ్యపై అనేక కేసులు ఉండటంతో ఆయన ప్రత్యర్థులు పథకం ప్రకారం సెటిల్‌మెంట్‌కు అని తీసుకువచ్చి ఏదైనా చేశారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీనివాస్ జగ్గయ్యపేటకు చెందినట్టు చెబుతున్నారని కానీ, ఇక్కడ వ్యక్తి కాదని, పేరు కూడా మార్చి చెప్పి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొబైల్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అక్కడ అధికార పార్టీ నేత కావటంతో పోలీసులు మరింత సవాల్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. జగ్గయ్యపేట సీఐ జానకీరాంను వివరణ కోరగా ఎల్లయ్య సోదరుడు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని, 6 ప్రత్యేక దర్యాప్తు బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని తెలిపారు ఇదిలా ఉండగా రెండ్రోజులుగా అదృశ్యమైన వడ్డే ఎల్లయ్య ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

### అపర్ణ ఎవరు?

హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు వచ్చి ఎల్లయ్యను ప్రత్యేకంగా జగ్గయ్యపేటకు తీసుకవెళ్లిన అపర్ణ ఎవరన్నది పోలీసులకు అంతుచిక్కడం లేదు. అపర్ణకు ఎవరైనా సుపారీ ఇచ్చి కావాలనే ఎల్లయ్యను కిడ్నాప్ చేయించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే పంచాయితీ విషయంలో పరిచయమైన అపర్ణ పంచాయితీకి పిలిస్తే రాష్ట్రం దాటి ఎలా వెళ్లాడు, ఆమె వెనక ఎవరున్నారని పోలీసులు ఆరాతీస్తున్నారు. ఎల్లయ్య తీసుకెళ్లిన కారు కూడా సూర్యాపేటకు చెందిన కట్టెల వ్యాపారిదిగా సమాచారం. ఎల్లయ్య కుటుంబ సభ్యులు అనుమానితులుగా పేర్కొన్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.




వడ్డె ఎల్లయ్య(ఫైల్), నిందితులు వచ్చారని చెబుతున్న కారు

# యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

**భువనగిరి అర్బన్, ఏప్రిల్ 20:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాతసేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట ఆలయంలో స్వయంభువులకు నిత్యకైంకర్యాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలను వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.19,58,045 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా శివాలయంలో సీతారామచంద్రస్వామివారి నవరాత్రోత్సవాలు శనివారం పరిసమాప్తమయ్యాయి. ఈ నెల 9న ప్రారంభమైన ఉత్సవాలు శనివారంతో ముగిశాయి.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

### 23న హుండీ లెక్కింపు

యాదగిరీశుడి హుండీ లెక్కింపు ఈ నెల 23న నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కొండకింద వ్రత మండపంలో మంగళవారం ఉదయం 7గంటలకు హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్టు తెలిపారు.

## రాష్ట్రంలో రైతులను పట్టించుకునే నాథుడే లేడు


నెమ్మికల్ సభలో మాట్లాడుతున్న జగదీ‌ష్‌రెడ్డి

**ఆత్మకూర్(ఎస్) / గరిడేపల్లి, ఏప్రిల్ 20 :** రాష్ట్రంలో రైతులకు నష్టం జరిగితే పట్టించుకునే నాథుడే లేడని, ఉమ్మడి జిల్లాలో 3 లక్షల ఎకరాల పంట ఎండిపోయి రూ.600 కోట్ల నష్టం వాటిల్లిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్), గరిడేపల్లి మండలాల్లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధికారంలోకి వచ్చిన నాలుగు నెలలోనే ప్రజలకు చుక్కలు చూపిస్తుందని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు రైస్‌మిల్లర్ల వద్ద, కంకర మిల్లుల వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, అడిగిన వారిని చెప్పుతో కొడతామంటూ బూతులు మాట్లాడుతూ వీధి రౌడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మర్ల చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ముద్దం కృష్ణారెడ్డి, ఖానాల మల్లారెడ్డి, బెల్లంకొండ యాదగిరి, సత్యనారాయణ రెడ్డి, బొల్లె జానయ్య, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

● గరిడేపల్లిలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాపోలు నవీన్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కడియం వెంకటరెడ్డి, వీరంరెడ్డి శంభిరెడ్డి, కొప్పుల సైదిరెడ్డి, దొండపాటి అప్పిరెడ్డి, చెన్నబోయిన సైదులు, వైస్ ఎంపీ పీ గుత్తికొండ ప్రమీల, ఎంపీటీసీ కడియం స్వప్న, రాంసైదులు, ప్రధాని సైదులు, మన్సూర్ అలీ, పెండెం వీరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సుఖేందర్‌రెడ్డితో ఎలాంటి విభేదాల్లేవు

**నార్కట్‌పల్లి, ఏప్రిల్ 20:** 'మా నాయకుడు కేసీఆర్‌ను గౌరవించే ప్రతీ ఒక్కరిని నేనూ గౌరవిస్తాను.. గుత్తా సుఖేందర్‌రెడ్డితో నాకెలాంటి విభేదాల్లేవు' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు, పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ పరిస్థితిపై శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్నందునే గుత్తాకు సీఎం కేసీఆర్ ఉన్నత పదవి కట్టబెట్టారన్నారు. తాను పుట్టకముందు నుంచే గుత్తా రాజకీయాల్లో ఉన్నారని, ఆయన గురించి మాట్లాడేంత పెద్దోడిని కాదని అన్నారు. గుత్తా చేసిన వ్యాఖ్యలు తనను ఉద్దేశించి చేసినవి కావని అనుకుంటున్నానని, కేసీఆర్ గురించి ఏదో అన్నారని చెబుతున్నారని, ఏమన్నారో తనకు కచ్చితంగా తెలియదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందని, ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయని, ఈ బిజీ షెడ్యూల్‌లో గుత్తాకు కేసీఆర్ సమయం కేటాయించకపోవచ్చని జగదీ‌ష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత కచ్చితంగా సుఖేందర్‌రెడ్డితో మాట్లాడి పార్టీ నిర్మాణంలో సలహాలు తీసుకుంటామని, గుత్తా వ్యాఖ్యలకు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదన్నారు. భూమి మీద నడవాలని అన్న మాటకు తాను కట్టుబడి నడుచుకుంటామని పేర్కొన్నారు. మంత్రి వెంట నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎంపీగా ఒక్కసారి గెలిపించండి


పులిగిల్లలో ఇంటింటా ప్రచారంలో జహంగీర్

**వలిగొండ, ఏప్రిల్ 20 :** భువనగిరి ఎంపీగా తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ ప్రజలను కోరారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్లలో ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడిన పులిగిల్ల గ్రామంతో తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. తన ఎన్నికల ప్రచారం పులిగిల్ల నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల చరిత్ర ఏంటో ప్రజలు ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు. తనకు ఎలాంటి వ్యాపారాలు, వ్యాపకాలు లేకుండా పోరాడుతున్న తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలన్నారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు వరికుప్పల యాదయ్య, రూ.10వేల విరాళాన్ని సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, నారి అయిలయ్య, జగదీ‌ష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆమనగంటి వెంకటేశం, సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, నాయకులు వెంకటేశ్, సుదర్శన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

## ప్రజాకంఠక పాలన సాగిస్తున్న కాంగ్రెస్


ఆత్మకూర్(ఎం) సభలో మాట్లాడుతున్న మల్లేష్

**ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 20 :** అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాకంఠక పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్ ఆరోపించారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చెప్పిన మాయమాటలు నమ్మి, క్షణికావేశంలో ఓటు వేసిన ప్రజలు అరిగోస పడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో సుభిక్షంగా ఉంటే కాంగ్రెస్ నాలుగు నెలలకే ప్రజలకు ముఖ్యంగా రైతులకు నరకం చూపిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీలో తాను ఉన్నప్పుడు మంత్రి ఉత్తమ్ తన సీటు అమ్ముకోవడంతో ఆ పార్టీని వీడానన్నారు. కాంగ్రెస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఒకే సామాజిక వర్గానికి కొమ్ము కాస్తూ టికెట్లు కేటాయించాడని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, బూడిద బిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు సంక్షేమ విరుద్ధ పార్టీలన్నారు. రైతులను నమ్మించి దగా చేసిన కాంగ్రెస్‌కు తెలంగాణను పట్టించుకోని బీజేపీలను పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీ‌ప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు బీసు చందర్, మాజీ అధ్యక్షుడు భాషబోయిన ఉప్పలయ్య, ఎంపీటీసీ కవిత, యాస ఇంద్రారెడ్డి, పీ పూర్ణందర్‌రాజు, కోరె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు మోదీ ఘనతే


సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి

**రామగిరి, ఏప్రిల్ 20 :** మహిళా రిజర్వేషన్ బిల్లును అమలుచేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా శక్తి సమ్మేళన కార్యక్రమంలో ఆయన మట్లాడారు. 500 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఆయోధ్యలో రామాలయ నిర్మాణం మోదీ హయాంలోనే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కుటుంబపాలనకు ఓటు వేసినట్టేనని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జి బంగారు శృతి మాట్లాడుతూ రామమందిర నిర్మాణానికి వ్యతిరేకంగా పక్క దేశాలకు మద్దతిస్తూ దేశంలో అలజడికి సృష్టించే కుట్రపడిన కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మోదీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టనున్నారని అన్నారు. మోదీ బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధిలోకి తీసుకువచ్చాడని అన్నారు. సమావేశంలో మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత, పార్లమెంట్ ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నల్లగొండ, సూర్యాపేట జిల్లాల అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి, బొబ్బ భాగ్యరెడ్డి, హనుమంత్‌రెడ్డి శ్రీదేవిరెడ్డి, మందడి కరుణ, శానంపూడి రజిత, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, రావెళ్ల కాశమ్మ, శకుంతల సులోచన, నీరజ, లక్ష్మీప్రసన్న తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాతి: మంత్రి ఉత్తమ్


గరిడేపల్లిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**మేళ్లచెర్వు / గరిడేపల్లి / మఠంపల్లి / హుజూర్‌నగర్ / హుజూర్‌నగర్ / నేరేడుచర్ల, ఏప్రిల్20 :** కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పక్షపాతి అని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. శనివారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించే ఎన్నికల ప్రచార సభ సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రైతుల కోసం ఈ ప్రాంతంలో అనేక ఎత్తిపోతల పథకాలు నిర్మించి, రైతులకు తాగు, సాగు నీరు అందిస్తున్నామన్నారు. వేసవిలో కూడా ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి లేకుండా ఎత్తిపోతల ద్వారా తాగునీరు అందిస్తామని మంత్రి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలుపిస్తామని, రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని మంత్రి అన్నారు. ఈ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగు అవుతుందన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచిన బీజేపీని జనం నమ్మే పరిస్థితి లేన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పోటీ నామమాత్రమేనన్నారు. రెండు పార్టీలకు డిపాజిట్‌లు గల్లంతవుతుందన్నారు. 15 స్థానాల్లో బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందని, 10 స్థానాల్లో డిపాజిట్‌లు కోల్పోవడం ఖాయమన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వందశాతం ఎన్నికల హామీలు అమలుచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. అదేవిధంగా ఎత్తిపోతల పథకాలను సమర్థంగా పనిచేసేలా చేస్తామన్నారు. కేసీఆర్ ప్రజాస్వామబద్ధంగా కాకుండా రాచరిక పాలన నడిపారని ఆరోపించారు. కేసీఆర్ ఒక్క డీఎస్సీని ప్రకటించలేదన్నారు. నిరుద్యోగులు పదేళ్లుగా బాధలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వేలాది ఉద్యోగాలు భర్తీ చేసిందని గుర్తుచేశారు. సోనియా, రాహుల్‌గాంధీ ఈ దేశానికి దిశ, దశ నిర్దేశం చేయబోతున్నారన్నారు. కాంగ్రెస్‌తోనే సుస్థిరత లభిస్తుందన్నారు. హుజూర్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. హుజూర్‌నగర్‌లో నిర్వహించే ప్రచార సభకు ప్రతీ బూత్ నుంచి కనీసం 30 మంది కార్యకర్తలను తరలించాలని మంత్రి పిలుపునిచ్చారు.

● మేళ్లచెర్వు, చింతలపాలెంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ మండల శాఖల అధ్యక్షుడు కాకునూరి భాస్కర్‌రెడ్డి, నరాల కొండారెడ్డితో పాటు నందిరెడ్డి ఇంద్రారెడ్డి, పోశం వెంకట్‌రెడ్డి, మేళ్లచెర్వు వైస్‌ఎంపీపీ గాయం గోపీరెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణ, కొట్టె సైదేశ్వరరావు, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

● గరిడేపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పయిడిమర్రి రంగనాథ్, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, కటకం రమేష్, గుండు రామంజీ, బండ నర్సిరెడ్డి, షేక్ చాంద్ మియా, సందీప్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

● మఠంపల్లి కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, నాయకులు ఆదూరి కిషోర్‌రెడ్డి, నవీన్‌నాయక్, సైదులు, వంటిపులి శ్రీనివాస్, బాబు, రామచంద్రయ్య, భీముడు, అప్పారావు, ఎంఎం యాదవ్, కరీం, సక్రునాయక్, ఎల్లారెడ్డి, భాస్కర్‌నాయక్, పిచ్చిరెడ్డి, వెంకటేశ్వరెడ్డి పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్‌లో సాముల శివారెడ్డి, తన్నీరు మల్లికార్జున్‌రావు, యరగాని నాగన్న, ఈడ్పుగంటి సుబ్బారావు, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, అల్లం ప్రభాకర్‌రెడ్డి, దొంతగాని శ్రీనివాస్, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, గెల్లి రవి, సంపత్‌రెడ్డి, మజీద్, అజీజ్‌పాషా, కుక్కడపు మహేష్, శివరామ్‌యాదవ్, ఎస్‌కె సైదా, గురవయ్య, బెల్లంకొండ శ్రీను, రామరాజు, ముశం సత్యనారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఫణి, సుబ్బరాజు పాల్గొన్నారు.

● నేరేడుచర్లలో నిర్వహించిన సమావేశంలో నేరేడుచర్ల, పాలకవీడు మండలపార్టీ అధ్యక్షులు కొణతం చినవెంటకరెడ్డి, సుబ్బారావు, మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, ఎంపీపీ భూక్యా గోపాల్, జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మోతీలాల్, వైస్‌చైర్మన్ అలక సరిత, జితేందర్‌రెడ్డి, నాగయ్య, జ్యోతిబాబు, కట్టా రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ గెలవాలి


నార్కట్‌పల్లిలో ఓటును అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**నార్కట్‌పల్లి / చిట్యాల / రామన్నపేట / యాదగిరి గుట్ట రూరల్ / శాలిగౌరారం/ నకిరేకల్, ఏప్రిల్ 20 :** దేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలంటే కాంగ్రెస్ గెలవాల్సిన అవసరం ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట, యాదగిరిగుట్టతో పాటు నల్లగొండ జిల్లా చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్ మండలకేంద్రాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి, మాట్లాడారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని రాష్ట్రంలో 15 ఎంపీ స్థానాలను గెలుస్తుందన్నారు. పదేళ్లలో దేశానికి, భువనగిరి నియోజకవర్గానికి బీజేపీ చేసిందేమీ లేదన్నారు. ప్రధాని మోదీ నియంతాల వ్యవహరిస్తూ వ్యవస్థలను విధ్వంసం చేస్తున్నాడని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని మళ్లీ రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలోకి తేవాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని అందుకోసం రికార్డు మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి కసి, పట్టుదలతో పనిచేసే కార్యకర్తలు ఉన్నారన్నారు. 1.50లక్షల మెజార్టీతో విజయం సాధిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా తానే లోకల్ అని, ఇతర పార్టీల నాయకులే నాన్‌లోకల్ అని అన్నారు.

● నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, జెరిపోతుల భరత్, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, బింగి కొండయ్య, నేతకాని కృష్ణయ్య, ఎస్‌కే సమద్, ప్రజ్ఞాపురం సత్తి, గడ్డం పశుపతి, దూదిమెట్ల స్రవంతి, వారాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, గుడిపాటి లక్ష్మినర్సు, మారగోని ఆంజనేయులు, ఏర్పుల పరమేశం, లింగస్వామి, మోహన్ పాల్గొన్నారు.

● రామన్నపేటలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి దూలం వెంకటనారాయణ, టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, నాయకులు గంగుల వెంకటరాజారెడ్డి, పున్న జగన్మోహన్, నార్మాక్స్ మాజీ చైర్మన్ గుంగుల కృష్ణారెడ్డి, ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, బాలకిషన్, పట్టణ అధ్యక్షులు మహ్మద్ జమీరుద్దీన్, ఎంపీటీసీలు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఎండీ రేహాన్, ఎండీ అక్రమ్, గుత్తా నరసింహారెడ్డి, పృధ్వీరాజ్, గాదె శోభారాణి, సురేందర్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

● యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జనగాం ఉపేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, ఎంపీపీ చీర శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ శివరాత్రి దానయ్య, మునిసిపల్ కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, గౌళికార్ అరుణారాజేష్, వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌గౌడ్, గుండు నర్సింహగౌడ్, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో మాజీ ఎంపీపీ లోకసాని లావణ్య, భర్త రంగారెడ్డి, మన్నెం మల్లయ్య, శానాల రవీందర్‌రెడ్డితో పాటు అడ్లూర్, శాలిగౌరారం మార్కెట్‌కు చెందిన దాదాపు 100 మంది ఎమ్మెల్యే సామేల్, కిరణ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర రనీల యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు పాదూరి శంకర్‌రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, చాడ సురేష్‌రెడ్డి, వడ్లకొండ పరమేష్‌గౌడ్, గన్నపురెడ్డి భిక్షంరెడ్డి, యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● నకిరేకల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, బచ్చుపల్లి గంగాధర్‌రావు, పన్నాల రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెలవు ఇవ్వడంలేదని ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకర్

**దేవరకొండ, ఏప్రిల్ 20:** సెలవులు ఇవ్వకుండా పైస్థాయి అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆర్టీసీ డ్రైవర్ ఆత్మాహత్యకు యత్నించాడు. పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియోను ఆర్టీసీ డిపోకు చెందిన ఓ గ్రూపులో పోస్ట్ చేశాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ డిపోలో శనివారం జరిగింది. బాధిత డ్రైవర్ శంకర్, అతడి భార్య విజయ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి గ్రామానికి చెందిన మూడావత్ శంకర్ రెండేళ్ల కిందట నల్లగొండ డిపో నుంచి దేవరకొండ డిపోకు బదిలీపై వచ్చి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ వద్దకు వెళ్లి తనకు ఆదివారం తండాలో పండగ ఉందని, అలాగే తన కుమారుడికి పరీక్ష ఉందని సెలవు ఇవ్వాలని కోరాడు. ఇప్పటికే గురు, శుక్రవారాల్లో విధులకు హాజరుకాలేదని, తిరిగి సెలవు కావాలని అడుగటం ఇదేం పద్ధతని రాజీవ్ ప్రేమ్‌కుమార్ మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన శంకర్ తాటికోల్ రోడ్డు వద్దకు వెళ్లి అక్కడే ఓ షాప్‌లో పురుగుల మందు కొనుగోలు చేశాడు. ఆర్టీసీ సీఐ సైదులు, డీఎం, కంట్రోలర్ డీవీ నారాయణ, సూపర్‌వైజర్ యాదయ్య తనకు డ్యూటీలు, సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని గంటలో పురుగుల మందు తాగి మృతి చెందుతున్నానని సెల్ఫీ వీడియో దిగి ఆర్టీసీ గ్రూపులో పెట్టాడు. అనంతరం పురుగుల మందు తాగాడు. వెంటనే స్పందించిన ఆర్టీసీ ఉద్యోగులు ఫోన్ సిగ్నల్, సెల్ఫీవీడియో ఆధారంగా శంకర్ ఉన్న ప్రాంతానికి వెళ్లారు. శంకర్‌ను హుటాహుటిన దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అతడి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా తన భర్తకు సెలవు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న డీఎం సీఐ ప్రేమ్‌కుమార్, సీఐ సైదులు, కంట్రోలర్ డీవీ నారాయణ, సూపర్‌వైజర్ యాదయ్యపై చర్యలు తీసుకోవాలని శంకర్ భార్య మూడావత్ విజయ దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త ఈ నెలలో అదనంగా 5 రోజులు డ్యూటీ చేశాడని, అయినప్పటికీ సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరసింహులు తెలిపారు.

### సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు : డీఎం ప్రేమ్‌కుమార్

ముడావత్ శంకర్ తరుచూ విధులకు గైర్హాజర్ అవుతాడని డీఎం రాజీవ్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లోనూ అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరయ్యాడని, తిరిగి ఆదివారం పండగ ఉందని సెలవు అడిగాడని తెలిపారు. ఇదేం పద్ధతని సెలవుకు నిరాకరించినట్టు తెలిపారు. ఆర్టీసీ సీఐ, కంట్రోలర్‌లు శంకర్‌ను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయలేదని తెలిపారు. విధులకు ప్రతి రోజూ హాజరుకావాలని కోరితే బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నాడని అన్నారు.

# దోపిడీ దొంగల ముఠా అరెస్టు

● రూ.30.40లక్షల సొత్తు స్వాధీనం
● రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి

**భువనగిరి టౌన్, ఏప్రిల్ 20 :** యాదాద్రి భువనగిరి జిల్లాలో చైన్ స్నాచింగ్స్, దొంగతనాలతో హడలెత్తిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. ఈ మేరకు శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పొట్టేటి మరియాదాస్ యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెంలో కొన్నిరోజులుగా భార్యాపిల్లలతో నివాసముంటూ తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనుల్లో భాగంగా పరిచయమైన మోటకొండూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన కర్నె లక్ష్మితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. అయితే ఇరు కుటుంబాలను పోషించే క్రమంలో వ్యయం పెరిగింది. కానీ ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో సులభ సంపాదన కోసం చైన్‌స్నాచింగ్స్, దొంగతనాలకు ప్రణాళిక రూపొందించుకొని సోదరుడైన పొట్టేటి శాంతయ్య, బావమరిది బాణాల రాజేష్‌ను ఒప్పించి లక్ష్మితో కలిసి నలుగురు ముఠాగా ఏర్పడ్డారు. చైన్‌స్నాచింగ్‌కు మారుమూల ప్రాంతాలను, ఒంటరిగా సంచరించే మహిళలను ముందుగానే గుర్తించి రెక్కీ నిర్వహించి అదును చూసి దోపిడీకి పాల్పడేవారు. ఈ క్రమంలో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు కూడా చేశారు. ఇలా భువనగిరి పరిసరాల్లో స్వల్ప వ్యవధిలోనే 10 చైన్‌స్నాచింగ్స్ 5 దొంగతనాలకు పాల్పడటంతో స్థానికంగా భయాందోళన నెలకొంది. ఆయా ఘటనలపై ఫిర్యాదుల మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో శుక్రవారం ఆలేరు మండలం జీడికల్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా పట్టుబడిన నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించిన క్రమంలో చైన్‌స్నాచింగ్స్, దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాగా తేలింది. దీంతో ఆ ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.30.40లక్షల విలువైన 41తులాల బంగారు, 2 కిలోల వెండి ఆభరణాలు, ఒక మోటార్ బైక్ తదితర సామాగ్రిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీలుగా తరలించారు. అయితే చోరీ అయిన మిగతా 10 తులాల బంగారాన్ని కూడా నిందితుల నుంచి స్వాధీనం చేసుకుంటామని, బాధితులకు కోర్టు ద్వారా ఆభరణాలను అప్పగిస్తామని కమిషనర్ తెలిపారు. జిల్లావాసులను భయాందోళనకు గురిచేసిన ముఠా ఆటకట్టించిన పోలీసులను పోలీస్ కమిషనర్ అభినందించి నగదు రివార్డును అందజేశారు. సమావేశంలో డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు డీసీపీ లక్ష్మినారాయణ, ఏసీపీలు రవి కిరణ్‌రెడ్డి, రమేష్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, గుట్ట రూరల్ సీఐ కొండల్‌రావు, తుర్కపల్లి ఎస్ఐ తక్కీయోద్దీన్, ఆలేరు ఎస్ఐ వెంకట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### దొంగతనాల చిట్టా

యాదాద్రి జోన్ పరిధిలో ముఠా 10 చైన్‌స్నాచింగ్, 5 దొంగతనాలకు పాల్పడింది. భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4, ఆలేరు పరిధిలో 3, యాదగిరిగుట్ట, మోటకొండూరు స్టేషన్ల పరిధిలో రెండేసి, ఆత్మకూరు, మోత్కూరు, భువనగిరి టౌన్, తుర్కపల్లి స్టేషన్ల పరిధిలో ఒక్కో చోరి కేసులో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు.

### ఎన్నికలకు భారీ బందోబస్తు

పార్లమెంట్ ఎన్నికల కోసం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. నిష్పక్షపాతంగా పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యాత్మక బూత్‌లను గుర్తించి అదనపు బలగాలను కేటాయిస్తామన్నారు. రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తామన్నారు. భువనగిరి, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 816 బూత్‌లకు 166 సమస్యాత్మకంగా ఉన్నాయన్నారు. 21న భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ షో జరిగే 2 కిలోమీటర్ల మార్గంలో శనివారం నుంచే బందోబస్తు ఏర్పాటు చేసి తనిఖీలు చేశామన్నారు.

## ఆటో ఢీకొని ఉపాధ్యాయుడు మృతి

**దామరచర్ల, ఏప్రిల్ 20:** నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని బొత్తలపలెం గ్రామంలో ఆటో ఢీకొని ఉపాధ్యాయుడు శనివారం మృతి చెందాడు. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని దాచారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నకిరేకంటి సైదులు(55) మిర్యాలగూడలో నివాసముంటున్నాడు. దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగా మిర్యాలగూడ నుంచి బొత్తలపాలెం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిని దాటుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన సరుకు రవాణా ఆటో బలంగా ఢీకొట్టిన అనంతరం పల్టీకొట్టి అతడిపై పడింది. ఈ ప్రమాదంలో సైదులుకు తీవ్రగాయాలయ్యాయి. 108వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. సైదులు భార్య సంతోషికుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. కాగా సైదులుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

### యువకుడికి గాయాలు

**నూతన్‌కల్ :** రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో శనివారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందిగామకు చెందిన వెంకట్, మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామంలో మామిడి తోటకు కాపలాగా ఉంటున్నాడు పోలుమళ్ల నుంచి నూతన్‌కల్ వైపునకు ద్విచక్రవాహనంపై వస్తూ ఆగి ఉన్న సరుకు రవాణా వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో వెంకట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

### ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

**పెన్‌పహాడ్, ఏప్రిల్ 20 :** సూర్యాపేట నుంచి మిర్యాలగూడెం వెళ్తున్న ఆర్టీసీ బస్సును సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలో శనివారం ధాన్యం లోడ్ లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు అద్దాలు పగిలిపోయాయి. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. లారీ డ్రైవర్ మద్యం సేవించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపారు. ప్రమాదంతో రోడ్డుపై నిలిచిన వాహన రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

## సాయినగర్ కాలనీలో చోరీ

**వలిగొండ, ఏప్రిల్ 20:** మాస్కులు ధరించిన గుర్తుతెలియని ఆగంతకులు మిద్దెపై నిద్రిస్తున్న మహిళలను ఇనుప రాడ్లు, కత్తులతో బెదిరించి ఇంట్లోకి చొరబడి బంగారు పుస్తెలతాడు, వెండి కొంత నగదును శుక్రవారం అపహరించుకుపోయారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్‌లాల్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయదారుడైన భీమిడి మహేందర్‌రెడ్డి వలిగొండ మండలకేంద్రంలోని సాయినగర్ కాలనీలో నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి అతడు పని నిమిత్తం ఇతర ప్రాంతానికి వెళ్లగా అతడి భార్య సంధ్య, తల్లి పద్మ, ఇద్దరు చిన్నారులతో కలిసి ఇంటి మిద్దెపై నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి గుర్తుతెలియని అగంతకులు ఇంటిపైకి ఎక్కి ఇనుపరాడ్లు, కత్తులతో మహిళలను బెదిరించి మెడలో బంగారు ఆభరణాలు ఇవ్వాలని బెదిరించారు. తమ వద్ద ఏంలేదని తెలుపగా ఇంటి తాళాలను పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 3 తులాల బంగారు పుస్తెల తాడు, నాలుగు చిన్న బంగారు ఉంగరాలు, రెండు బంగారు గుండ్లు, 30 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదును అపహరించారు. పారిపోతూ కాలనీలో కోసం సత్యనారాయణ నిద్రిస్తుండగా అతడి సెల్‌ఫోన్‌ను కూడా ఎత్తుకెళ్లారు. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులు మధుసూదన్‌రెడ్డికి ఫోన్‌లో తెలిపారు. అతడు ఇంటికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. సంఘటనా స్థలాన్ని అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు సందర్శించారు. క్లూస్ టీం బృందం సభ్యులు ఆధారాలను సేకరించారు. బాధితుడు మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు బంగారు ఆభరణాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు.

## ఎక్సైజ్ ఉద్యోగి బ్రెయిన్‌డెడ్‌తో అవయవదానం


అంజయ్య(ఫైల్‌ఫొటో)

**వలిగొండ, ఏప్రిల్ 20:** తాను తనువు చాలిస్తూ అవయవదానంతో మరో ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన అంజయ్య. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కంచనపల్లి గ్రామానికి చెందిన మెరుగు అంజయ్య(45) ఆలేరులోని ఎక్సైజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో ఆయన వలిగొండ మండల తహసీల్దార్ కార్యాలయ పరిధిలో వీఆర్‌వోగా పనిచేశాడు. గత ప్రభుత్వం వీఆర్వోలను ఇతర శాఖలకు సర్దుబాటు చేయగా అంజయ్య ఎక్సైజ్ శాఖకు బదిలీ అయ్యాడు. కాగా ఈనెల 15న ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. తోటి ఉద్యోగులు హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. శనివారం 20న బ్రెయిన్‌డెడ్ అయినట్లు కుటుంబ సభ్యులకు డాక్టర్లు తెలిపారు. వారి సలహా మేరకు అంజయ్య అవయవాలు, కళ్లు, కిడ్నీలు, గుండె, లివర్‌ను దానం చేశారు. ఆయన అవయవదానంతో ఐదుగురి ప్రాణాల్లో వెలుగులు నిండాయి. అందరితో కలుపుగోలు తనంతో స్నేహపూర్వకంగా ఉండే అంజయ్య మృతిని గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ముగిసిన అగ్నిమాపక శాఖ వారోత్సవాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

**నల్లగొండ టౌన్, ఏప్రిల్ 20:** అగ్నిమాపక శాఖ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణ, డిజాస్టర్ మెనేజ్‌మెంట్‌పై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది నరహరి, రామనర్సయ్య, సురేష్‌కుమార్, రామకృష్ణ, అయ్యన్న, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, గోవింద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

**తిప్పర్తి, ఏప్రిల్ 20:** కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి తిప్పర్తి మండలం నుంచి అధిక సంఖ్యలో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీ పార్టీలో చేరుతున్నారు. తిప్పర్తి మండల పరిధిలోని ఇండ్లూరు, మామిడాల, సర్వారం గ్రామాల నుంచి ఇండ్లూరు బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లబోతు రమేష్ ఆధ్వర్యంలో 2 వందల మంది బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారు నల్లగొండ పార్లమెంట్ కోకన్వీనర్ పిల్లి రామరాజు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్ క్షేమంగా ఉండాలంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కన్మంతరెడ్డి, బండారు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు



కొప్పోలులో నిర్వహించిన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**మిర్యాలగూడఅర్బన్, ఫిబ్రవరి 20:** పట్టణంలో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకలకు కేంద్ర బిందువైన పెద్దబజార్ శ్రీరామమందిరంలో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా జయిని సుధాకర్, ధనలక్ష్మి జ్ఞాపకార్థం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పట్టణ పరిసర ప్రాంత భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తల్లం అశోక్, నాయకులు రంగా లింగయ్య, కుక్కడపు రాంమూర్తి,రేపాల అంతయ్య, రవికుమార్, శ్రవణ్‌కుమార్, నవీన్‌కుమార్, కవిత, కళావతి, రజిని, ధనలక్ష్మి, లీలారాణి, జవహర్, శ్యాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గుర్రంపోడు:** మండలంలోని కొప్పోలు గ్రామంలో శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ వేడుకల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో గ్రామానికి చెందిన యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

**నార్కట్‌పల్లి, ఏప్రిల్ 20:** పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అంతేకాక ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి దోహదపడాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, కామినేని మెడికల్ కాలేజీ సంయుక్తంగా శనివారం నార్కట్‌పల్లి కిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఓటరు చైతన్య సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకొని వారందరూ తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులందరూ ఓటింగ్‌లో పాల్గొనాలని కేశవులు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో నిల్చున్న అభ్యర్థుల్లో నచ్చని వారు ఉంటే నోటాకు వేయాలని, అక్రమాలకు పాల్పడుతుంటే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సమావేశంలో జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, కిమ్స్ సూపరింటెండెంట్ ఎడ్విన్ లూథర్, ఆర్టీఐ రాష్ట్ర కన్వీనర్ ఉషారాణి, కిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, పీఆర్‌వో కిరణ్, సందీప్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి, రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

**కనగల్, ఏప్రిల్ 20:** మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద నల్లగొండ - దేవరకొండ ప్రధాన రహదారిపై రూ.12 కోట్ల నిధులతో చేపట్టిన బ్రిడ్జి కం రోడ్డు విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ సీఈ రాజేంద్రకుమార్, ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యతాప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జూన్, జూలై మాసాంతానికి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ యాకూబ్, డీఈ గణేష్, జేఈ దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం : కేసు నమోదు

**తిప్పర్తి, ఏప్రిల్ 20:** మండల పరిధిలోని సర్వారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని సర్వారం గ్రామానికి చెందిన జాల మీనయ్య కుమార్తె జాల శ్రీలత (20) నల్లగొండలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 24వ తేదీన ఆమెకు వారి తల్లిదండ్రులు వివాహం నిశ్చయించారు. శుక్రవారం అందరితో పాటు ఉన్న యువతి ఇంట్లో వారికి చెప్పకుండా మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకు ఆమె ఆచూకీ లభించలేదు. అంతేకాక బంధువులు, స్నేహితుల ఇంట్లో వెతికినా ఆమె కనిపించలేదు. దీంతో యువతి తండ్రి మీనయ్య శనివారం తిప్పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

# కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

**● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**







మర్రిగూడ, నల్లగొండలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సమావేశంలో మాట్లాడుతున్న కైలాష్‌నేత

**మర్రిగూడ, ఏప్రిల్ 20:** కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో శనివారం వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం పాలనపై ప్రజలు విసిగెత్తారని, నూతన ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 15 ఎంపీ సీట్లు రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలుచేస్తుందని, ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై కొంతమంది ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా మర్రిగూడ మండలంలోని మర్రిగూడ, లెంకలపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో లెంకలపల్లి బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి అయితగోని వెంకన్న, మర్రిగూడలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు లోకేష్‌తో పాటు 300మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరాందాసు శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ అనిల్‌రెడ్డి, జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఆదివాసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమావత్ శ్రీనివాస్‌నాయక్, నీలిమా చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, వీరితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### కాంగ్రెస్ పార్టీకే ప్రజల మద్దతు : పున్నా కైలాష్‌నేత

**హాలియా:** ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉందని, మరోసారి రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లను ప్రజల మద్దతుతో గెలవబోతున్నట్లు టీపీసీసీ సెక్రటరీ పున్నా కైలాష్‌నేత అన్నారు. హాలియాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేనని, త్వరలోనే బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడం ఖాయమన్నారు. రాజకీయాల్లో భీష్మ పీతామహుడైన జానారెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మద్దతుతో ఎంపీ అభ్యర్థిగా రఘువీర్ అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమని అన్నారు. టీఆర్‌ఎస్, ఆంధ్రా ప్రభుత్వంతో ములాఖత్ అయి నీటి యాజమాన్యంలో సరైన పద్ధతి అనుసరించకపోవడం వల్లే నేటి ఈ పరిస్థితి కారణమన్నారు. బీజేపీ రైతు వ్యతిరేక చట్టాలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందన్నారు. సమావేశంలో నాయకులు కాకునూరి నారాయణగౌడ్, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కుక్కడల ఆంజనేయులు, వెంపటి శ్రీనివాస్, నందికొండ మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిక

**నల్లగొండ:** నల్లగొండ పట్టణంలోని 11వ వార్డు కతాల్‌గూడకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం నల్లగొండ పట్టణంలోని మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య సమక్షంలో హస్తం గూటికి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు ఇన్‌చార్జి దండంపల్లి వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్లకుంట్ల వెంకట్‌రెడ్డి, దాసరి శంకర్, యువజన అధ్యక్షుడు దాసరి విజయ్, దండంపల్లి పరశురాం, ఎస్సీసెల్ జిల్లా నాయకులు కాంపల్లి కృష్ణ, జానీ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఊబిది యాదయ్య, నరసింహ, సాంబెల్, శంకర్, శివ, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



ఆస్పత్రిలో అల్పాహారం అందజేస్తున్న టీడీపీ నేతలు





మునుగోడు, మిర్యాలగూడలో కేక్ కట్ చేస్తున్న ఐలయ్యయాదవ్, నాయకులు

**(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల మధుసూదన్‌రెడ్డి కేక్‌ను కట్ చేశారు. అదేవిధంగా చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్‌వీ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో నిత్యం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆకునూరి సత్యనారాయణ, అధికార ప్రతినిధి కూరేళ్ల విజయ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంకేఐ సిద్ధిక్, నాయకులు గుండు వెంకటేశ్వర్లు, శ్రీను, నాగరాజు, తేలు రవి, చంద్రశేఖర్, క్రాంతికుమార్, స్వరాజ్, మదుసూదన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు నర్సిరెడ్డి, రామకృష్ణ, అశోక్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● హాలియాలో చంద్రబాబు జన్మదిన వేడుకలను నాగార్జునసాగర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మువ్వా అరుణ్‌కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉడుతూరి నర్సింహారెడ్డి, మందా తిరుపతయ్య, తెలుగు యువత రాష్ట్రకార్యదర్శి కంచర్ల వెంకన్న, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తుమురుకోటి వెంకన్న, నాయకులు పెదనారాయణ, కర్నె రమణారెడ్డి, రాంబాబు, రామస్వామి, రవి పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో పార్టీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. అనంతరం శ్రీరామనవమి ఉత్సవాల్లో చంద్రబాబు పేరున ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మచ్చ సైదులు, చిలుకల వెంకన్న, నుసుం నగేష్, ఉప్పలపాటి గోపాలకృష్ణ, కాశయ్య, అనంతరాములు, నాగేందర్, శోభనాద్రి, ప్రభాకర్, శంకర్‌రావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

● మునుగోడులో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఏపీలో టీడీపీ కూటమి విజయం సాధిస్తుందని ఐలయ్యయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మక్కెన అప్పారావు, అధికార ప్రతినిధి ఎండీ. షరీప్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోసుకొండ వెంకటేష్, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల లింగయ్య, నాయకులు లింగయ్య, సుదర్శన్, సైదులు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడలో నిర్వహించిన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు దోమల వెంకన్న, పుప్పాల యాదయ్య, పగడాల లింగయ్య, నర్సింహ, రాములమ్మ పాల్గొన్నారు.

● దేవరకొండలో వయోవృద్ధుల ఆశ్రమ కేంద్రంలో వృద్ధులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వస్కుల క్రిష్ణయ్య, కోతి అమరేందర్‌రెడ్డి, బ్రహ్మచారి ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పల రమేష్, నాయకులు శ్రీనివాస్, బాలయ్య, స సత్తయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం పుష్కరఘాట్‌లో వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఫైలాన్ శివాలయం పుష్కరఘాట్‌ను శుభ్రం చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

**నాగార్జునసాగర్, ఏప్రిల్ 20:** నాగార్జునసాగర్ ఫైలాన్ కాలనీలో 2016లో పుష్కరాల సమయంలో రూ.4 కోట్ల వ్యయంతో శివాలయం వద్ద నిర్మించిన వీఐపీ పుష్కరఘాట్ వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లుతుంది. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి మినీలో శనివారం 'పుష్కరఘాట్‌లో వ్యర్థాలతో దుర్వాసన' శుభ్రం చేయని మునిసిపల్ సిబ్బంది అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన మునిసిపల్ కమిషనర్ శ్రీను శనివారం మునిసిపల్ సిబ్బందితో పుష్కరఘాట్‌ను శుభ్రం చేయించి వ్యర్థాలను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వక్త్యం చేసి 'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు తెలిపారు.

## పాలిటెక్నిక్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నాగార్జునసాగర్, ఏప్రిల్ 20:** నాగార్జునసాగర్ ఫైలాన్‌కాలనీలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీ కోసం 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఐలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ పాలిటెక్నిక్ కళాశాలలో సీఈసీలో 60 సీట్లు, ఈఈఈలో 60 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 22వ తేదీ చివరి తేదీగా పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష మే 24వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు రాసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## 'గ్రామానికి దగ్గరలో వైకుంఠధామం నిర్మించాలి'

**శాలిగౌరారం, ఏప్రిల్ 20:** గ్రామానికి సమీపంలో వైకుంఠధామం నిర్మించాలని మండలంలోని పెర్కకొండారం గ్రామస్థులు ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఐదేళ్ల క్రితం గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో వైకుంఠధామం నిర్మించారని, ప్రస్తుతం అది అసౌకర్యంగా, నిరుపయోగంగా ఉందన్నారు. చనిపోయిన వారి మృతదేహాలను మోసకపోవడానికి, దహన సంస్కారాలు చేయడానికి కష్టంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి వెంటనే గ్రామానికి దగ్గరలో ప్రభుత్వ స్థలం దొరకని పక్షంలో ప్రైవేట్ స్థలం కొనుగోలు చేసి నూతనంగా వైకుంఠధామం నిర్మించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు గన్నపురెడ్డి భిక్షంరెడ్డి, యుగేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జయరాజు, శంకర్, మస్తాన్, ఉషాన్, రమేష్, యాదగిరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నల్లగొండలో బీఆర్‌ఎస్ ఎంపీ గెలుపు ఖాయం



ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న విజయసింహారెడ్డి, భూపాల్‌రెడ్డి

**తిప్పర్తి, ఏప్రిల్ 20:** నల్లగొండ ఎంపీ స్థానంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఉమ్మడి తిప్పర్తి మండలం నాయకులు, ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారం ఉన్న సమయంలో పదవులు పొంది అధికారం పోయిన తర్వాత సొంత పార్టీనే విమర్శించే నాయకులకు ప్రజలు గట్టి సమాధానం చెబుతారని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. అదే విధంగా ఈ నెల 23న ఎంపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు వనపర్తి నాగేశ్వర్‌రావు, కందుల లక్ష్మయ్య, ఏనుగు వెంకట్‌రెడ్డి, శ్రీను, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ ప్రచార రథాల ప్రారంభం

**నల్లగొండ:** నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ప్రచార రథాలను శనివారం నియోజకవర్గ సమన్వయకర్త తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద ప్రచార రథాలకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, మందడి సైదిరెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, నారబోయిన భిక్షం, కోటయ్య, రాంమోహన్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

**పెద్దవూర, ఏప్రిల్ 20:** పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి కార్యకర్తలను కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన నియోజకవర్గంలో నిర్వహించే ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపీపీ చెన్ను అనురాధాసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నడ్డి లింగయ్యయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘాలు ఉపాధ్యాయులకు అండగా నిలవాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 20:** సంఘాలు ఉపాధ్యాయులకు అండగా నిలవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సామ సైదులు కుటుంబ సభ్యులకు రూ. 6లక్షల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ (ఎఫ్‌డబ్ల్యూఎఫ్)తో ఉపాధ్యాయులకు అండగా నిలవడం హర్షనీయమన్నారు. అనుకోని దుర్ఘటనలు, ఆపద సమయాల్లో ఆదుకునేలా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పథకాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

అనంతరం సైదులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖరరెడ్డి, చావ రవి, బక్కా శ్రీనివాసాచారి, గోపనబోయిన నాగమణి, అడావత్ చినవెంకన్న, పెరుమాళ్ల వెంకటేశం, శ్రీనివాస్, మధుసుధన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుల సస్పెన్షన్

**అడవిదేవులపల్లి, ఏప్రిల్ 20:** ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పాఠశాలల మానిటరింగ్ సమయంలో విధులకు గైర్హాజరైన బంగారుకుంటతండా ప్రధానోపాధ్యాయుడు బి.జానారెడ్డితో పాటు ఉపాధ్యాయులు టి.చంద్రశేఖర్‌లను డీఈవోను సస్పెండ్ చేసినట్లు ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన నిర్వహణ రిజిస్టర్లు, పాఠశాల రిజిస్టర్ల నిర్వహణలో నిబంధనలను పాటించని చిట్యాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కు మెమో ఇచ్చినట్లు తెలిపారు. సకాలంలో సంతృప్తికరమైన ఆధారాలు చూపించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా కృషి చేయాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



## సంక్షిప్త సమాచారం...

**చిట్యాల:** చిట్యాలలోని బాలాజీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ వినియోగదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట నగేష్, కత్తుల లింగస్వామి, కత్తుల యాదయ్య పాల్గొన్నారు.

**మునుగోడు:** భువనగిరి నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు బొడ్డు నాగరాజుగౌడ్, మాదగోని నరేందర్‌గౌడ్ అన్నారు. బీజేపీ ఎంపీ నర్సయ్యగౌడ్ గెలుపు కోరుతూ మునుగోడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు.

**మిర్యాలగూడ టౌన్:** ప్రధాని మోదీ పాలనలో దేశానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించిందని బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చిలుకూరి రమాశ్యాం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మనుమాన్‌పేటలో పర్యటించారు. ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలని కోరారు.

**మర్రిగూడ:** బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినంతా మాత్రాన కార్యకర్తలు అధైర్య పడవద్దని, వారి వల్ల ఒరిగేది ఏమిలేదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్‌యాదవ్, మాజీ ఎంపీపీ అనంత రాజుగౌడ్ అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వారి అవసరాలు తీర్చుకున్నారని ఆరోపించారు. ఎవరు ఏ పార్టీలోకి వెళ్లినా మర్రిగూడ మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ స్థిరంగా ఉందని అన్నారు.

**కొండమల్లేపల్లి:** విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్ఐ రామ్మూర్తి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని శివజ్యోతినగర్ కాలనీలో కరాటే పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్ఐ బెల్టులను ప్రదానం చేశారు. ఆత్మరక్షణకు కరాటే విద్యను నేర్చుకోవాలని సూచించారు.

**చిట్యాల:** తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలు నేర్పుతూ సక్రమమైన మార్గంలో పెంచాలని మాజీ ఐపీఎస్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు మల్లవరపు బాలలత కోరారు. చిట్యాలలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో మాట్లాడారు. పిల్లలను మార్కుల కోసం వత్తిడి చేయవద్దని, వారికి చదువుపై ఇష్టం కలిగేలా చేయాలన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన, ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని, దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు.

**మర్రిగూడ:** మండలంలోని రాజుపేట తండా పరిధిలో పద్మశాలీ కాలనీలో ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కట్టంగూరు:** భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**పెద్దవూర:** మండలంలోని ఊట్లపల్లి రేషన్ డీలర్ సన్నపరెడ్డి వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాల డీటీ ముక్తార్ తెలిపారు. ఊట్లపల్లిలోని రేషన్‌షాపుపై ఆకస్మిక తనిఖీ నిర్వహించగా 2.83 క్వింటాళ్ల రేషన్ బియ్యం తక్కువగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెద్దవూర ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**గుర్రంపోడు:** మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన అకాలవర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని శాంతినగర్‌కు చెందిన హనుమానాయక్, గుర్రంపోడుకు చెందిన ఆవుల యాదయ్య, రేపాక కృష్ణయ్య ఇంటి పైకప్పులు లేచిపోయాయి. వారికి సహాయం అందించాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అలాగే ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.

**మాడ్గులపల్లి:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని జడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేసి పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు.

**మాడ్గులపల్లి:** సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తుదారుడికి 30రోజుల లోపు సమాచారం అందించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌రామ్ అన్నారు.

## బత్తాయి తోటలో అగ్ని ప్రమాదం

**● సుమారు రూ.5లక్షల నష్టం**

**త్రిపురారం, ఏప్రిల్ 20:** త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి శివారులోని రైల్వేట్రాక్ వెంట ఉన్న బత్తాయి తోటలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత రైతు జంపాల మహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... సుమారు రాత్రి 10 గంటల సమయంలో ప్రమాదవశాత్తు తోటకు మంట అంటుకుంది. బత్తాయి తోట రైల్వేట్రాక్ పక్కన ఉండటంతో రైతు నుంచి సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు ప్రమాదస్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు బత్తాయి చెట్లు 150, కొబ్బరి చెట్లు 50 తోటకు నీటిని అందించే 10ఎకరాల డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వ నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

### గ్యాస్ లీక్‌తో ఇల్లు దగ్ధం

**తిప్పర్తి:** గ్యాస్ లీకై ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని గడ్డికొండారం గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వివాహిత కంచర్ల లక్ష్మి తన కోడలితో కలిసి ఇంట్లో గ్యాస్ స్టవ్‌ను వెలిగించి వంట చేస్తుంది. ఆ సమయంలో గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న వారు బయటికి పరుగెత్తారు. ఇంట్లో మంటలు పెరిగి పక్క గదికి రావడంతో అందులో ఉన్న ఫ్రిజ్ పేలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న ఫ్యాన్‌లు, లైట్‌లు, మిక్సీలు, బీరువా, ఇంటి సామగ్రి అంతా కాలి బూడిదైంది. మంటలు చెలరేగడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చే సరికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో భారీనష్టం తప్పింది. ఆర్ఐ నరహరి ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.